## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-12-2024    సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భూ వివాదాలకు ముగింపు పలికేలా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అధికారులకు స్పష్టం చేశారు.
- ❖ విశాఖపట్టణం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ నూతన భవనాల కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలియజేశారు.
- ❖ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- ❖ రైతులు వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లోకి డబ్బులు జమచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టి.నిషాంతి వెల్లడించారు.

========================

భూ వివాదాలకు ముగింపు పలికేలా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ అధికారులకు స్పష్టం చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రారంబించనున్న నేపధ్యంలో ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో మంత్రి దృశ్య మాద్యమ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. అన్ని రకాల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం మంత్రి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతీ సమస్యకు కాలపరిమితిని నిర్ధేశించుకుని పరిష్కారాలకు కృషి చేస్తామని వెల్లడించారు.

(వాయిస్ 20 సెకన్లు)

కాగా ఈ నెల 6వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులు జనవరి 8 వరకూ 33 రోజుల పాటూ జరగనున్నాయి. తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, సంబంధిత గ్రామాల రెవెన్యూ అధికారులు ఈ సదస్సుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

========================

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉద్ఘాటించారు. 200 యూనిట్ల వరకు షెడ్యూల్డ్ కులాలు తెగల వారికి ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. 15 లక్షల 17 వేల 298 షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు, 4 లక్షల 75 వేల 557 షెడ్యూల్డ్ తెగల కుటుంబాలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోందని తెలిపారు. ఈ పథకంపై అసత్య ప్రచారాలు నమ్మొద్దని.. అర్హులైన ప్రతిఒక్కరూ దీన్ని వినియోగించుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు.

========================

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా లోక్ సభలో ఈరోజు విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ దక్షిణ కోస్తా రైల్వేజోన్ అంశంపై అడిగిన ప్రశ్నకు రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ... రైల్వేజోన్ ఏర్పాటు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించటం జరిగిందన్నారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ నూతన భవనాల కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

========================

రైతులు వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. అమలాపురంలో ఈరోజు ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.... జిల్లాలోని 22 మండలాల్లోనూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేశామని తెలిపారు. తుఫాను కారణంగా తేమ శాతం ఎక్కువగా ఉన్నా సరే ధాన్యం తీసుకోవాల్సిందేనని మిల్లర్లకు ఆదేశాలు చేసామన్నారు. వర్షాల నేపథ్యంలో సహకార సంఘాల్లో బరకాలను అందుబాటులో ఉంచామని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టి.నిషాంతి కోరారు.

========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 7వ తేదీన బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ జె.వి.మురళి తెలిపారు. బాపట్ల మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్న "ఉపాధ్యాయ తల్లిదండ్రుల" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని కలెక్టర్ తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 7వ తేదీన అన్ని పాఠశాలలలోను స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ముఖ్యమంత్రి బాపట్లలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని వివరించారు.

విరామం

========================

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు ప్రాధమిక భాధ్యత వహించాలని విశాఖ జిల్లా పరిశ్రమల జాయింట్ చీఫ్ ఇన్ స్పెక్టర్ శివశంకర్ రెడ్డి అన్నారు. "రసాయన పరిశ్రమల్లో భద్రత, అత్యవసర నిర్వహణ" అనే అంశంపై విశాఖ స్టీల్ ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ లో రెండు రోజుల పాటూ జరగనున్న కార్యశాలను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో సుమారు 165 రసాయన పరిశ్రమలు ఉన్నాయని, రెండింటిలో ఇటీవల పెద్ద ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాదాలు నివారించే

బాధ్యత విషయంలో యాజమాన్యాలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ రసాయన పరిశ్రమలు, ఫార్మా కంపెనీలకు చెందిన 270 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమ సమన్వయ కర్తగా మాజీ శాసన సభ్యులు పెందుర్తి వెంకటేశ్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు క్యాబినెట్ హోదా కల్పిస్తూ.. ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాల నిర్వహణ వ్యవహారాలను పెందుర్తి వెంకటేశ్ పర్యవేక్షించనున్నారు. ఆయన గతంలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం నుంచి రెండు సార్లు శాసన సభ్యులుగా గెలుపొందారు.

========================

శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈరోజు సాయంత్రం చేపట్టాల్సిన పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం వాయిదా పడింది. సాయంత్రం 4 గంటల 08 నిమిషాలకు పీఎస్ఎల్వీ- సీ59ను మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపాల్సి ఉండగా ఉపగ్రహంలో సాంకేతిక లోపం కారణంగా వాయిదా పడింది. రేపు సాయంత్రం 4 గంటల 12 నిమిషాలకు ఈ రాకెట్ ను నింగిలోకి పంపుతామని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రకటించింది. కాగా యురోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ కక్ష్యలోకి తీసుకెళ్లనుంది.

========================

శ్రీకాకుళం జిల్లాలోని  పాతపట్నం మండల పరిధిలో పులిసంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ రేంజ్ అధికారి ఆర్. రాజశేఖర్ తెలిపారు. పాతపట్నం, కాశీబుగ్గ అటవీ రేంజ్ ల పరిధిలోని పాతపట్నం మండలం దాసుపురం గ్రామం సమీపంలో గల పంటపొలాల్లో పులి సంచరిస్తుందన్న సమాచారంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ గ్రామాల పరిసర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, తమ పాడి పశువులను సంరక్షించుకోవాలని తెలిపారు.

========================

దిగ్గజ సంగీత దర్శకులు, సినీ నేపథ్య గాయకులు ఘంటసాల వెంకటేశ్వర రావు 102వ జయంతి ఈరోజు. ఘంటసాల 1922 డిసెంబర్ 4 న గుడివాడ సమీపంలోని చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మ దంపతులకు జన్మించారు. తెలుగు సినిమా తొలితరం నేపథ్యగాయకులలో ఒకరయిన ఘంటసాల ఆలపించిన పాటలు అజరామరంగా ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. వ్యాఖ్యానంతో సహా ఆయన ఆలపించిన భగవద్గీత తెలుగు నాట అత్యంత ప్రజాదరణ పొందింది. ఆంధ్రరాష్ట్రంలో అప్పటి విజయనగరం సంగీత కళాశాలలో విద్యను అభ్యసించారు. 1942లో స్వాతంత్ర్య సమరయోధునిగా "క్విట్ ఇండియా ఉద్యమం"లో పాల్గొని రెండు సంవత్సరాలు జైలు జీవితం కూడా అనుభవించారు. 1970లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

========================

తూర్పు మధ్య అరేబియా సముద్రం దానిని ఆనుకుని ఉన్న కోస్తా కర్ణాటక ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం బలహీనపడి ఆగ్నేయ అరేబియా సముద్రం వద్ద  అల్పపీడనంగా మారింది. ఇది రానున్న 24 గంటలలో పశ్చిమం వైపు కదులుతూ.. మరింత బలహీనపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్ లలో రేపు  తేలిక పాటి నుండి  ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం  ఉందని పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

========================

==========================